# అపోహల మధ్య సానుభూతి

"గోపి"

కథానిక

ఏదేనా ఆభరణం కావాలంటే ఖజానా నిండుకున్నది అని చెప్పినా... అందరూ వెఱ్ఱిగా చూసొచ్చిన సినిమాకి వెళ్ళటం లేదన్నా, శ్రీమతి వెంటనే గత కొన్ని వేల సంవత్సరాల నుంచీ పురుష ప్రజ స్త్రీ జనావళిపై చేస్తూన్న అత్యాచారాలను కమ్యూనిస్టులు బూర్జువాలమీద కూడా చెప్పలేనంత బాగా ఏకరువు పెట్టేస్తుంది. కుటుంబ జీవితపు రేఖా గణితంలో శ్రీమతికి సమస్యలన్నీ ఒక్కటే, వాటి ప్రతిపాదనలు మాత్రమే వేరు. వాదన సామాన్యంగా కొట్టిన పిండి; పర్యవసానం "పోనిస్తురూ! మా మగాళ్ళకి ప్రేమకూడాను. అవసరానికి మనుష్యులంకానీ..." అని అర్థ వాక్యంలో సిద్ధాంతీకరించి పారేస్తుంది. ఆమె ఆర్గ్యుమెంట్లు చెబుతూన్నంత సేపూ ఏ లాయరూ పనికిరాడు. "రామరసం ముప్పైఎనిమిది జబ్బులకి మందు" అనే రైలుడబ్బా డాక్టరు ఎడ్వర్టయిజుమెంటువలె, ఏవిషయమైనా ఒకే బాణీలో దంచి పారేస్తుంది. ఇదొక్కటే కాదు ప్రత్యేకత... అర్థాంగికి తెలియని జీవిత రహస్యాలున్నాయని మురిసిపడే మగాడెవడేనా ఉంటే ఉత్త వెఱ్ఱి బాగుల వాని కింద కట్టుయ్యవచ్చు.

తమ రహస్యాలనైతే దాచలేరంటే నమ్మొచ్చు. పురాణ పురుషులు వాడే మంత్రబద్ధమైన అస్త్రాల్లా భర్తలరహస్యాలని దాచిపెట్టి సమయం చూచి వాడుతారు. ఒకప్పుడు వీటిని ఆత్మసంరక్షణం కోసమే జాగ్రత్త పెడతారనుకోండి ఒక్కొక్కప్పుడు వీటిని వాడకుండానే వదిలేస్తారు సదవకాశం దొరక్క. నిజానికి ఇవి వాళ్ళ తప్పొకటే కాదు దానికి దోహదమిచ్చే పురుషులు కూడా, చాలా ఎక్కువే. ఇదంతా ఎందుకంటే దూరాన్నుండగానే మా ఆవిడ వ్యాఖ్యానం విన్నాను: "మగవాళ్ళందరూ అంతేనమ్మా" అని. బహుశా మలుపు తిరిగిన నా ముఖం గుర్తుపట్టే అందనుకున్నాను.

"అంతే అంటావా. రజనీ! నా బ్రతుకిల్లా అధ్వానము కావాల్సిందేనా? చూచూస్తూ ఊరుకోమంటావా?" అని సినిమా స్టయిల్లో అడిగింది కుమారి.

"పోనిస్తూ దీనిగురించి రచ్చకెక్కడం నా మతంకాదు. విననట్లుగా, చూడనట్లుగా ఊరుకో. మరికొంచెం అభిమానంగా ఉండు; సమయం చూచి ఇల్లు మార్చేయ్." అని దూరాలోచనతో చెప్పినట్లు తాపీగా చెప్పింది.

దగ్గరకడ్డ నన్ను చూచి రెండు కళ్ళూ కొంగు చివరతో ఒత్తేసుకుని "వెళ్ళొస్తానమ్మా" అంటూ దారితీసింది కుమారి.

"ఏం ఇవాళ మగాళ్ళమీద మరీ కసిగా దాడి తీస్తున్నావ్? క్రొత్త అత్యాచారం ఏం జరిగిపోయింది?" అడిగాను.

"ఏముందీ అందరు మగాళ్ళూ ఒకటే అన్నాను: కారా మరి?" అడిగింది ధీమాగా.

"ఎలాగౌతారు రజనీ, అలాగైతే, ఈ పెళ్ళిళ్ళ ముందు చూపులు 'ఔను కాదూ' అనుకోడాలు, అందాలెంచుకోడాలు ఇవన్నీ ఎందుకొస్తాయి చెప్పూ?" అన్నాను.

"రూపంలో కాదు నేననేది; మన స్తత్వంలోనూ, బుద్ధిలోనూ.. నీతిలోనూ" అని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది.

"నీలాంటి ప్రఖ్యాత నారీమణి, ధర్మశాస్త్రవేత్త, అలా శలవిస్తే కాదనలేం కానీ—" వాక్యం పూర్తిచెయ్యనివ్వలేదు శ్రీమతి.

"చాలు బాబూ మీ వ్యాఖ్యానం; నన్నట్టే రేపకండి." అని వాదనకి తన విముఖత చూపించినట్లూ పారేసిందో ఛాలెంజి.

"అది కాదు రజనీ! కుమారికొచ్చిన కష్టం ఏమిటి? నీ సలహా ఏమిటి?" అని అడుగుతున్నాను.

"ఏముందీ 'ఇంటింటా ఒకబాయ్యి మాయింట్లో మరోబాయ్యి' ఇదే కుమారి చెప్పిన విషయం.

ఆయింట్లో దిగుతూన్నప్పుడే చెప్పాను." చెప్పింది అసలు విషయం మాత్రం కాకుండా.

కుమారికీ మా ఆవిడకి కొంచెం బంధుత్వంకూడా ఉంది. ప్రక్కవీథిలోనే బస. కుమారి భర్త బాబు. (చిన్నప్పుడు ముద్దుకు పెట్టుకున్న పేర్లే శాశ్వతంగా నిలిచిపోయాయి.)

"బాబు చేసిన అత్యాచారం ఏమిటి? కుమారి కొచ్చిన కష్టం ఏమిటి? విపులంగా చెప్పకూడదూ!" మళ్ళా అడిగాను, ఎలాగన్నా చెవినిపడ్డ విషయం అంతు కనుక్కుందామని.

"కొంతమంది పెళ్ళిముందర పెడత్రోవ పడతారు. మరికొంతమంది తరువాత పడతారు. పెడత్రోవ పట్టని మగాళ్ళంటే..." అని ఒక ప్రతిపాదన విసిరింది.

"అంటే బాబు పెళ్ళితరువాత పెడత్రోవ పట్టిన బాపతన్నమాట?"

"హుఁ" అన్నది నీసలుగా.

"పోనీ మరి నా సంగతి చెప్పావుకావు" అడిగానవేళ, ఎందుకో బుద్ధి గడ్డితిని.

"పోనిస్తురూ! కడుపుచించుకుంటే కాళ్ళమీద పడ్డదన్నట్లు..." ఏదో తెలిసీ చెప్పడాని కిష్టం లేదన్నట్లు సామెత దంచింది.

"చెబుదూ! సమస్యలో అర్థబాగం ప్రతిపాదించే ప్రాచీన కవుల్లా ఎందుకీ డొంకతిరుగుడు." హెచ్చరించాను మళ్లా.

"చెబుతేమట్టుకు అయ్యగారికి కోపంవస్తుంది." సాగదీసింది.

"రాదులే! చెప్పదలుచుకున్నది కాస్తా సీదా తేల్చు" అడిగాను.

"నేనేం చెప్పదలుచుకోలేదు స్వామీ! మీరే అడుగుతున్నారు." అన్నది పద్ధతిప్రకారం.

"ఔను. ముమ్మాటికీ నేనే అడుగుతున్నా త్వరగా తేల్చు." అడిగాను ధీమాగా.

"ఐతే సరి. మధ్య ప్రశ్నలు వెయ్యకుండా అడ్డంకులు చెప్పకుండా వినండి" అని కథ ప్రారంభించినట్లారంభించింది.

"అనగా అనగా ఒకప్పుడు ఫేక్టరీ ఏస్టేటులో కొత్త బంగళాలు కడుతున్నారు." మొదటివాక్యం వెలువడిందో లేదో ఐదు సంవత్సరాల వెనకాల విషయం ఒక్కసారి మెరుపులా వచ్చింది. ఒళ్లు గగుర్పొడిచింది. చిరుచెమట ప్రారంభించింది. కంపిస్తూన్న గొంతుకతో, "ఆగు, అది కాస్తా నన్నే చెప్పనివ్వు..." అని కథ ప్రారంభానికే అడ్డు తగిలాను.

"ముందే చెప్పానుగా పూర్తిగా చెప్పనివ్వరని" గొణిగింది శ్రీమతి.

"అది నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు" అన్నాను అనవసరపు ఉద్రేకంతో.

"కథ కాస్తా సొంతంగా చెప్పేక అప్పుడు అవసరమైతే మీ వ్యాఖ్య చెప్పండి" అన్నది శ్రీమతి అప్పుడే చాలామట్టుకు గెలుచుకున్నట్లు.

"పోనీలే! నీతో వాదించి ఏం లాభం? నీ ప్రతిపాదనలన్నీ రైటేనని ఒప్పుకుంటాను సరా?..." ఇంకా వాక్యం పూర్తిచెయ్యకుండానే— "అంటే నేనన్న మొదటి తెగకి చెందుతారన్నమాట!" అంటూ కిలకిలా నవ్వుతూ వెళ్ళిపోయింది యింటిలోకి. నేను పూర్వస్మృతి అగాధంలో పడిపోయాను. మా శ్రీమతికి ఎంతవరకూ తెలుసు అన్న కుతూహలం, ఆ కథ ఏ రూపంగానూ మా శ్రీమతి నోట వినకూడదనే పట్టుదల, ఒకదానితో వొకటి పోటీవేస్తున్నాయి. ఇప్పటికీ ఆనాటి నా మనోభావాల వైఖరి అర్థంకాలేదంటే ఎవ్వరూ నమ్మరు.

• • •

వర్షకాలం రానున్నది. ఎండకితోడు వాతావరణంలోని తేమ, ఒళ్ళు ఎంత తుడుచుకున్నా చెమటతో ముంచెత్తుతూంది. రాత్రి ఉక్క, ఎవరో ఒకరు పొరుగింటి ఫేక్టరీ డాక్టరుగార్ని లేపడం చప్పుడుతో రోజూ నిద్రఅన్నది కష్టసాధ్యమైంది. అసలే దేశం కొత్త. వెయ్యిమైళ్ళ దూరం! నీటిలోంచి గడ్డుమీద పారేసిన చేపలా ఉంది పరిస్థితి. ఆఫీసులో అవసరానికి సంపాదించిన నలుగురు స్నేహితులు, మొక్కుబడి పలకరింపులు మినహాయిస్తే, పరిచితులు, స్నేహితులు పిచ్చాపాటీ చెప్పుకోడం. ఇలాంటివి పూర్తిగా లేవనే చెప్పాలి. ఒంటరితనం, బారకాసులాంటి బంగళా ఒక కుక్కనో పిల్లినో పెంచుకున్నా బావుణ్ణనిపించేది. అసలు విషయం మరిచేను. ఎదురుగుండా కొన్ని బంగళాలు కడుతున్నారు. గవర్నమెంటు పనులు జరిగితే ఊపిరాడ కండా నేనా జరుగుతాయి, లేకపోతే అదే నిద్ర. సంవత్సరాలు గడిచిపోతాయి.

రానున్నది వర్షాకాలం కదూ?వర్షాకాలం అంటే ఏనుగు తొండాలతో గుమ్మరించినట్లు పడుతుంది.

కూలీల ప్రాణాలు పోయినా బంగాళాలమీద డాబాలు పడితే-కాలపరిమితి చాలదని తెలిసీ కూడా ప్రారంభించిన కంట్రాక్టరుకి 'లక్షలు' దక్కుతాయి. పని చాలా జోరుగా చేయిస్తున్నాడు. అంతా కష్టపాటుకి బాగా అలవాటుపడ్డ రాజస్థానీ కూలీలు పిల్లాడి మొదలు కుటుంబాలతో సహా ఎండని లక్ష్యంచెయ్యకుండా పనిచేస్తున్నారు. ప్రకృతికెదురుతిరిగి, రాళ్లు పగలగొట్టి, రాత్రీపగలూ ఇళ్లుకట్టడమే పనిగా పెట్టుకున్న కూలీలకి నా అన్న ప్రదేశంకానీ, కనీసం ఒక గడ్డిపాక కూడా ఉండదు. ఎక్కడ పనిఉంటే అక్కడే నాలుగు ఇటికలు పేర్చి ఒక 'ఇల్లు' వేసుకుంటారు; పనైపోడంతోనే, అక్కడనుంచి మరో జాగాకి మార్చేస్తారు మకాం. అక్కడ మళ్ళా ఇదేవరస.

బల్లసరంజాం పూర్తిచేసి కాంక్రీటు డాబా ప్రారంభించేరు. పని చాలా జోరుగా జరుగుతున్నాదని చెప్పేను కదూ? అవాళ ఆఫీసునుంచి వచ్చి బట్టలు మార్చుకుందామనుకుంటున్నా. బల్లసరంజాం ఫెళఫెళమంది. హాహాకారాలుచెలరేగాయి. ఒకే క్షణంలో డాక్టరూ నేనూ, పనిజరుగుతూన్న జాగాకి పరిగెత్తాం. నాలుగూ ఊడదీసి క్రిందపడిపోయిన కూలీలని బయటికి లాక్కొచ్చాం. అదృష్టవశాత్తూ, చాలామంది స్వల్పగాయాలతో తప్పుకున్నారు. ఒక్క స్త్రీ మాత్రం షోపుగా దెబ్బతిన్నది. డాక్టరు ప్రథమచికిత్స ప్రారంభించి నన్ను "ఏంబ్యులెన్సు" కోసం పరిగెత్తమన్నాడు వెంటనే.

ఈ అమ్మాయిని ఇంతకు ముందు కూడా చూచాను. బహుశా ఇరవై-ఇరవైఐదుకి మధ్య ఉంటుంది వయస్సు. తెల్లగా పొడుగ్గాఉంటుంది. ముఖం బహుశా పాలిపోయినట్లుండటాన్ని ఏదో తెలియని విచారంతో బాధపడుతూందనిపించేది నాకు;బహుశా అది నా ఊహే ఐయ్యుండవచ్చు. ఆమె రంగురంగుల రాజస్థానీ దుస్తుల్లోని యౌవనం చూపరుల దృష్టిని తప్పకుండా ఆకర్షిస్తుందని మాత్రం చెప్పొచ్చు. ఆ రాత్రి ఎంత ప్రయత్నం చేసినా నిద్దరపట్టలేదు. డాక్టరు హాస్పిటాలునుంచి వచ్చేసరికి రెండు గంటలైంది. పరీక్షాఫలితం కోసం ఆత్రుతపడే విద్యార్థిలా నా గుండె కొట్టుకుంది. ఆమె ఎల్లాఉందోనని రెండుగంటలు రాత్రప్పుడు అడగడం చాలా అసభ్యంగా ఉంటుందని మెల్లిగా నా ఆత్రుతని అణిచిపెట్టేశాను.

ఉదయం లేస్తూనే డాక్టరుని చూచాను. అప్పుడే హడావుడిగా తయారౌతున్నాడు హాస్పటల్ కి వెళ్ళడానికి. అనుమాన పడకుండా, ఒకటి రెండు ప్రశ్నలువేసి "ఎలావుందా అమ్మాయి?"అని అడిగా. ఎంత యాథాలాపంగా అడుగుదామనుకొన్నా ఆత్రుత అణపలేక పోయాను స్వరంలో.

"అమ్మాయి చాలా బాగుంది. కానీ పరిస్థితి చాలా తీవ్రంగాఉనది. బహుశా ఆమెని సివిలు హాస్పిటల్ కి పంపేయాలనుకుంటాను" అన్నాడు. డాక్టరు మొరటు హాస్యం నాకు చాలా కష్టమనిపించింది. కానీ...

"ఏం? ఫేక్టరీలో పని చేస్తూన్న వాళ్ళసంబంధం కాదనేనా 'సివిలు హాస్పిటలుకి ఈ ప్రమాదస్థితిలో పంపడం?" అని అడిగాను. ఔనని తడూపాడు.

"నా సర్వెంటుగా ఎంట్రీ చెయ్యండి"

"డబ్బో?"

"కంట్రాక్టరు ఇస్తాడు?" బహు సహజంగా తోచింది చెప్పాను.

"ఎందు కిస్తాడూ? ఇక్కడ రోజుకి నాలుగు రూపాయలు. అక్కడ ఒక రూపాయే?" అని తేల్చాడు ఆమె జీవితం విలువ అణాపైసలతో.

"ఫరవాలేదు.ఆ మిగతా మూడూ నేనిస్తాను. ప్రమాదావస్థలో కదపకండి" అన్నాను చాలా ఉద్రేకంగా.

"నాకూ ఇష్టంలేదయ్యా! నేనూ నీలాగే బ్రహ్మచారినైతే ఫరవాలేదు. మా శ్రీమతికి ఏమన్నా ఇలాంటి ధర్మబుద్ధి చూపినట్లు తెలిస్తే అడిగావా? ఇంతకీ ముసలాణ్ణి కూడా!" అన్నాడు నేను ఏదో స్వలాభంకోసం చూస్తూనట్లు చూస్తూ! ఆవాళనుంచీ నేను డాక్టర్ని ఆ అమ్మాయి గురించి ప్రశ్న వెయ్యని దినం లేదు—డాక్టరు ఏమనుకున్నా సరే నని.

వారం దాటింది. వర్షాలు లంకించుకున్నాయి. డాబాలు గట్టి పడ్డాయి. కంట్రాక్టరు ఆరాటం చల్లపడింది. ఇంక తన డబ్బుకి ఫరవాలేదు. సాయంకాలం డాక్టరు నవ్వుకుంటూవచ్చి 'రావ్! పార్టీ ఎప్పుడు?" (ఈ కేసు వచ్చినదగ్గరనుంచీ

డాక్టరూ నేనూ చాలా దోస్తీ అయ్యాం. వాళ్ళింటికి వెళ్ళడం, అక్కడే టీ పుచ్చుకోవడం పిచ్చాపాటీ చెప్పుకోవడం డాక్టరు తన బ్రహ్మచారి దినాల్లో ఎలా వుండేవాడో చెప్పటం వీటితో చాలా దోస్తీ ఏర్పడింది.)

“ఎందుకేవిటి?” అడిగాను.

“మీ కంట్రీబ్యూటీకి ఇవాళ డ్రెసింగ్ సెరిమొనీ (మీతో ఇంత స్వేచ్ఛగా మాట్లాడుతున్నాననుకోకండి)” అంటూ ఆమె అందాన్ని తన మొరటు హాస్యంతో పొగిడాడు.

“హాస్టల్‌నుంచి పంపించేస్తారా?” చాలా ఆత్రుత చూపించేశాను కాబోలు బహుశా.

“అబ్బే అప్పుడే ఇంకా కథ ప్రారంభమే కాందే? ఇంకా పదిరోజులన్నా ఉండాలి. కానీ మీ సెలవైతే సివిల్ హాస్పిటల్‌కి మార్చేయవచ్చు” అని కొంటెగా చూశాడు నా వైపు.

“ఈ పదిరోజులకే. గదా! ఉండనియ్యండి ఫరవాలేదు” అన్నా. “అలా అంటారని తెలుసు నాకు. నాతో పాటు సాయంకాలం రండి మీ పేషెంటుని చూస్తురుగాని” అనేసి వెళ్ళిపోయాడు. ఆమెని రోజూ చూద్దామనే ఉండేది. డాక్టరు అసలే మొరటు మనిషి. నన్నసలు బ్రతకనిస్తాడూ? “అబ్బే నే చూడ్డం ఎందుకు మీరు రోజూ చూస్తూనే ఉన్నారుగా?” అందా మనుకున్నా కాని మాటలు నాలిక చివరనే ఉండిపోయాయి.

కొంచెం బెట్టుచేసినా డాక్టరు బలవంతంచేసి లాక్కెళ్ళాడు. “రావ్! మీరో బిమల్‌రాయ్ కావాల్సింది. చూడండీ! మీ కంట్రీ సరుకు, ఎంత చక్కగా ఉందో. ఆ పని దుస్తులు, అశుభ్రత, అన్నిటికీ మించిన పేదరికం వాళ్ళ అందాన్ని దాచేస్తున్నాయి కానీ . ఇవాళ మీకోసం ప్రత్యేకంగా తయారుచేశాం. ఏమనుకున్నారో తరువాత చెబుతారు కదూ?” అంటూ అసలే కొట్టుకుంటూన్న గుండెకి మరో డోసు బ్రాందీ తగిలించాడు, మాటల్లో.

ఆమె బెడ్ ప్రక్క నిలబడ్డాను. డాక్టరు స్టూల్ మీద కూర్చొని పరిచయం చేసేడు. “ఈయనే నమ్మా, ఇన్నాళ్ళూ నువ్వు యీ హాస్పిటల్‌లో ఉండడానికి డబ్బు సాయంచేసిన పుణ్యాత్ముడు. ఎలా ఋణం తీర్చుకుంటావో మరి” అని.

చిన్నగా నవ్వి నమస్కరించి ఒక కోరచూపు పారేసింది. అది డాక్టరు కంట పడకుండా ఉంటే ఎంతన్నా సంతోషించి ఉండేవాణ్ణి.

అవాళ దగ్గరనుంచీ డాక్టరు నన్నదేపనిగా ఏడిపించాలని చూస్తున్నాడా అనిపించింది. ఒకసారి మానవుడిలో 'క్యూరియాసిటీ' పుట్టిందో అది పూర్తిగా తెలుస్తేనేకాని ఊరుకోడు. అకస్మాత్తుగా ఏదో ప్రశ్న వెయ్యడం డాక్టరుకి తన హాస్యానికి మంచి అవకాశం దొరికింది. అవాళనుంచీ రానన్నా, రోజూ ఒకసారి ఆమెని చూడ్డానికి లాక్కుపోయేవాడు. ఇంకా ఏమన్నా అంటే బ్రహ్మచారికి మీకే ఇంత భయమెందుకండీ అని రెచ్చగొట్టేవాడు.

“పాపం ఆమెవాళ్ళెవ్వరూ వస్తూన్నట్లులేదే” అన్నాను. “మీరున్నారుగా. రావ్! డబ్బు చాలా ఖర్చుపెట్టేస్తున్నారు. మెంటల్‌గా చాలాసేపు ఆమెదగ్గరే గడుపుతున్నారు. కావాలంటే రాత్రి ఆమెకి శలవిచ్చేస్తా ఏం?” రానురాను డాక్టరనే మాటలు పట్టించుకోడం మానేశాను. ఎన్నాళ్ళనీ? పాపం డాక్టరైతే చాలా మంచివాడు. ఇదొక్కటే అతని దుర్బుద్ధి: ఏడిపించటం.

మరోసారి తీరుబడిగా విధవా వివాహాలమీద వాగించాడు. దాంట్లో ఘాటుగా వాదించాను, చాలా మంచిదని; తరువాత చెప్పాడు చల్లగా “రావ్! పాపం మీ అందాల రాణి విధవట. ఒక పిల్లాడుకూడాను. మీకు చాలా ప్రొగ్రెసివ్ అభిప్రాయాలుండటం బ్రతికిపోయింది.” అన్నాడు. వాళ్ళ ఆచారాలు వ్యవహారాలు ఆమెచరిత్ర అంతా తీరుబాటుగా కనుక్కొని ఏదో ఒక సమయంలో ఇలా హాస్యంచేసి, ఒక్కొక్క విషయం ఏకరువు పెట్టేవాడు. ఆమెనే తిన్నగా నాకు కావల్సిన ప్రశ్నలు అడిగి కనుక్కుందామనుకునేవాణ్ణి కాని, ఈ డాక్టరుకూడా ఉండగానే! మరేం బ్రతకక్కరలేదు తరువాత...

మరో పదిరోజులుకూడా గడిచిపోయాయ్. అవాళ డాక్టరు ఇంటికి రాలేదు నేనూ హాస్పిటల్‌కి వెళ్ళలేదు. ఒంటరిగా వెళ్ళదలుచుకోలేదు. అవాళ బహుశా ఆమెని వదిలేస్తారని తెలుసు. వర్షం కుంభవృష్టిగా పడటం, ఎప్పుడూ మసాబుచినుకులు. వీటివల్ల తక్కిన వినోదాలన్నీ కట్టుపడ్డాయి.

దాంతో మనస్సులో ఈ తెలియని స్త్రీ ఎక్కువ బాగా ఆక్రమించేది. రాత్రి ఎనిమిది దాటింది. తలుపు చప్పుడైంది, డాక్టరే అనుకున్నాను. కాదు, ఆ అమ్మాయి! హాస్పిటలునుంచి విడుదలైంది. మామూలు రాజస్థానీ దుస్తులు అలంకారాలు పూర్వ రూపంలో ప్రత్యక్షమైంది. తలకి వెనకాలే గాయం తగలడాన్న, ముఖం ఎప్పటిలాగే ఉంది. చెమ్మగిల్లిన కన్నులతో "మీరు చేసిన మేలు మరచిపోలేను" అన్నది. అప్పుడే తెరిపిచ్చిన వర్షం మళ్ళా జోరుగా ప్రారంభించింది. డాక్టరు మోటారు బైసికిలు శబ్దం విని ద్వారానికి ఎదురుగుండా నిలబడ్డామెను ప్రక్కగా నెట్టి తలుపువేసి కర్టను లాగాను. అప్పుడామెను డాక్టరు చూస్తే ఇంకేమన్నా ఉందీ? బహుశా అంత ధైర్యంగా రావడానికి డాక్టరు చెప్పిన విషేషాలే కారణం అనుకుంటా.

వర్షం తగ్గింది. హృదయంలో ఆవేశంలావచ్చిన దురూహాలూ కోరికలూ చల్లారి పోయాయి. ఆమె కృతజ్ఞత వెలిపుచ్చి వెళ్ళిపోయింది. ఆ క్షణాలు తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఆమె విప్పారిన కృతజ్ఞతా పూర్వపు నేత్రాల్లో "నేనేమీ మీకివ్వలేను నా స్త్రీత్వాన్ని తప్ప! కావాలంటే తీసుకోండి" అన్న విషయం మాటు లేకుండా కనబడింది. ఆమె నాకోసం వచ్చింది,-శాశ్వతంగా ఎట్టిసంబంధం ఉండదని తెలిసీకూడా! అదే క్షణంలో వచ్చిన వర్షం సదవకాశం ఇచ్చింది. డాక్టరి మోటారు సైకిలు శబ్దం అపహాస్యం చేసింది. నాలోని ఏదో తెలియని చైతన్యం, ఆత్మాభిమానం, పతనంనుండి కాపాడాయి.

డాక్టరు వెళ్ళిపోయాడు. పరిసరాలు చాలా మారి పోయాయి. హాస్పటల్లో ముసలి దాది తప్ప తక్కినవాళ్లెవ్వరూ పాతవాళ్ళు లేరు. నాకూ ఈ విషయం మరుపుకొచ్చింది. ఈ విషయం మా శ్రీమతికి ఎంతవరకూ తెలుసు ఎలా తెలుసు, అన్న విషయం అభేద్యంగానే ఉండిపోయింది. అలా ఉండిపోతుంది కూడా! ★

---

(36-వ పేజీ తరువాయి)

శాస్త్రచర్చ పెట్టుకుని కూర్చోడం భావ్యమేనా?- మొదలగు ప్రశ్నలు అనేకం బుద్ధిమంతులు కొందరు వేయవచ్చు. వాటికి సమాధానం ఒక్కటే— శతాబ్దాలుగా అనేక ప్రజ్ఞావంతుల ధీశక్తి మేధస్సు ఎంతో శ్రమపడి సాధించి మనకు అందించిన యీ పవిత్రాగ్నిని ఎల్లప్పుడూ ఉజ్వలింపచేసి, చీకటిలో కొట్లాడే అజ్ఞాన ప్రపంచానికి వెలుగు మార్గం చూపడం సంస్కారమున్న మన అందరి విధి. ముందుతరం వారికి కూడా యీ బాధ్యత ఎంతైనా ఉంది. అందువల్లనే నిజంగా యోచిస్తే గణిత శాస్త్రం మానవ సౌఖ్యానికి, సౌకర్యానికి యిచ్చిన దోహదం యింకే శాస్త్రమూ యివ్వలేక పోయింది. కేవలం బుద్ధి సృష్టించిన లోకానికి సంబంధించిన యీ శాస్త్రం, మన మామూలు ప్రపంచానికి ఏవిధంగానూ ఉపకరించదని ప్రతివారికీ నిశ్చితాభిప్రాయం. కాని ఏనాటికి ఏది ఎట్లా ఉపయోగపడుతుందో ఎవరు చెప్పగలరు? ఉదాహరణకి తీసుకుంటే ఆవిరిశక్తి, విద్యుచ్ఛక్తి, అణుశక్తి గణిత శాస్త్రంవల్లనే యీనాడు ప్రపంచానికి యింతగా ప్రయోజనకారులవుతున్నాయి. అందుకనే ప్రయోజనం అనేది నిరుత్సాహపు గడియల్లో శాంతి నివ్వడానికితప్ప శాస్త్రాభ్యాసానికి ఎంత మాత్రం మార్గదర్శి కానేరదు. నైతిక జీవిత పారిశుద్ధ్యానికి ఒక యుగంయొక్క కాని, ఒక జాతి యొక్కకాని ఔన్నత్యాన్ని యినుమడింప చేయడానికి గంభీరమైన గుణవిశేషాలు ఎంతైనా పని చేస్తాయి. అటువంటి విశిష్ట గుణాల్లో ఒకటి సత్యాన్వేషణ—ఈ సత్యాన్వేషణ గణితశాస్త్రంలో, యింకెక్కడా గోచరించనట్లు, బాగా స్పష్టంగా కనపడుతుంది. శిథిలమవుతున్న విశ్వాసాలను పునరుజ్జీవింపచేసి, ప్రాణాన్ని, శక్తిని పోస్తుంది గణితంలో సత్యాన్వేషణ. ప్రతి గొప్పవిషయం ఒక గొప్పలక్ష్యమే కాకుండా, మనలో ఉన్నతమైన ఒక చక్కని మనోవాతావరణాన్ని సృజించి, పుష్టినిచ్చేదిగాకూడ ఉండి తీరుతుంది. ఈదృష్టిలోనే మనం గణిత శాస్త్రాధ్యయనాన్ని, మననాన్ని పరిశీలించి శాస్త్రానికి అర్హమైన స్థానాన్ని ఎప్పుడూ యివ్వాలి. అప్పుడే మనం జ్ఞానానికి సరైన వారసులమన్న మాట.

(అనుసరణ: పోతుకూచి సూర్యనారాయణమూర్తి)